కథానిక

# చల్ల పెంకులు

కృష్ణానంద కుమార్

సరిగ్గా పదిహేను దినాలయింది నారాయడు స్కూలుకు వచ్చి. ఏమయిందో తెలుసు కుందామని బయలుదేరాను. పట్టుదలతో చదివే చురుకైన కుర్రవాడు నారాయడు. పది రోజులలో పెద్ద పరీక్షలు మొదలవ్వబోతూంటే వాడిలా బడికి రాకపోవడం తలుచుకుంటే నా మనసు పరిపరి విధాల పోయింది. పగటి వెలుగును చెదరగొట్టే నల్లటి చీకట్లు నలు వేపుల నుంచీ ముసురుకుంటున్నాయి. దుర దృష్ట జాతకుల బతుకుల్లా ఆకాశం వెలుగు బట్ట వదలి వెలవెల బోతూంది.

వాడేదైనా జబ్బున పడ్డాడేమో! ఒకవేళ చాలాకాలంగా మంచాన పడివున్న వాళ్ళమ్మ "హరీ" అనలేదు గదా? మరేదైనా అవాంత రాలు వచ్చాయేమో! అన్నీ ప్రశ్నలే. వాణ్ణి కలుసుకొంటే గానీ సమాధానాలు తెలియవు.

ఓ పూట తింటే మరో పూట పస్తుండే అస్తుబిస్తు కుటుంబం. వాడీ లోకంలో పడి కళ్ళు తెరువగానే, వాడి తండ్రి కళ్ళుమూసి మరో లోకానికి వెళ్ళిపోయాడు. నాలుగేళ్ళ క్రితం పక్షవాతంతో మంచ మెక్కిన వాడి తల్లి మరి మంచం దిగనేలేదు. పదహారేళ్ళు నిండని వాడి అక్క సంపాదించే నాలుగు రాళ్ళతో కాలాన్ని వెళ్ళదీస్తున్నారు వాళ్ళు. అలాంటి పరిస్థితుల్లో పెరిగిన నారాయడు స్నేహితుల పుస్తకాలు అరువు తీసుకొని చదువుకుంటూ ప్రతి క్లాసూ ఫస్టుగా పాసవడం వింతే మరి. చదువుమీద వాడికున్న శ్రద్ధ చూస్తే ఆశ్చర్య మేస్తుంది.

నేను స్కూల్లో చేరిన మొదటి రోజు అటెండెన్సువేస్తూ "నారాయణ" అని పిలిస్తే "ప్రెజెంట్ సార్" అని క్లాస్ ద్వారం దగ్గర చూశాను. ఓ చేత్తో చెడ్డీని పైకి లాక్కుంటూ మరో చేత్తో పుస్తకాల సంచిని భుజంపై కెగ దోసుకుంటూ న్నప్పుడు, ఆ కోలమొహంలో విడిన పెద్దరేకుల్లా కళ్ళూ, కొండవాగుల్లా వంకీలు తిరిగిన జుత్తూ, అమాయకమైన ఆ రూపం చూస్తే, ఒక్కసారిగా నా ఒళ్ళు జలదరించింది. మనస్సు కల్లోల మయింది. వాడు సరిగా మా సాయిని గుర్తుకు తెచ్చాడు. మా సాయి గూడా అచ్చు అల్లాగే వుండే వాడు.

ఆ రోజులలో నా వుద్యోగం పోయింది. గిరిజ ఒంటి మీద నగలు ఒక్కొక్కటీ, మంగళ సూత్రంతో సహా మాయమైనాయి. చివరకు మిగిలిన మా ఆఖరు ఆస్తి, ఆదే నా ఒక్కగా నొక్క కొడుకు సాయి చేత చిల్లి గవ్వ లేని స్థితిలో సరైన మందూ మాకూ లేక న్యుమోనియాతో కన్నుమూశాడు.

స్పష్టమైన ఉచ్చారణతో, భావయుక్తంగా నారాయడు పద్యం చదువుతుంటే, ఐదేళ్ళ మా సాయి కృష్ణశతకంలోని పద్యాలు పొల్లు పోకుండా అప్పచెప్పడం స్ఫురణకు వచ్చేది.

వాడి తెలివి తేటలకు పదును పెడితే భవిష్యత్తులో యెంతో పైకి వస్తాడు. అందుకు నేను చేయగలిగిందంతా చేయాలి. ఒకనాడు సాయిని గురించి నేను కన్న కలల్లో కొన్నైనా నారాయడి విషయంలో జరిగితే అంతకన్నా నాకింకేం కావాలి?

నారాయడిపై అలా ఆశలు పెంచుకొన్న నాకు వాడు గత పదిహేను రోజులు బడికి రాకుండా, కనీసం తనకొచ్చిన కష్టమేమిటో నాకు కూడా చెప్పకుండా యిలా యెందుకు చేశాడూ! ఏమైనా వాడిని యీ రోజు కలుసు కోవలసిందే.

"కార్పొరేషన్ కాలనీ" అన్న కండక్టర్ కేకతో యీ లోకంలోకి వచ్చిన నేను అడ్డుగా

నా ముందున్న నలుగురిని నెట్టుకుంటూ బస్సు దిగేశాను. వీధి దీపాల గుడ్డి వెలుతురు నా మనస్సులోని ఆందోళనలా అస్పష్టంగా వుంది. అడుగులు జాగ్రత్తగా వేస్తూ తడబడకుండా నడుస్తున్నాను. రోడ్డుకు వారగా రెండడుగుల లోతుగా, ఓ గోతిలో వుండే కొళాయి, దాని చుట్టూ దాదాపు ముప్పై నలభై కుండలూ వున్నాయి. సహజంగా అన్ని కొళాయిల దగ్గిర జరిగేట్లుగానే అక్కడా ఓ చిన్న సైజు యుద్ధం జరిగింది కాబోలు, రోడ్డంతా చిందర పందరగా పడివున్న కుండ పెంకులు అక్కడి వారి బతుకులకు ప్రతి రూపాలు. కొళాయికి కొద్ది దూరంలోవున్న మురుగ్గుంటలో పోలేక యిమడలేక పందులు కీచులాట.

ఓ యింటి వాకిట్లో చిమ్మచీకట్లో తెల్లని మల్లెచెండు తురుముకున్న ఓ తెల్లచీర నన్ను చూసి తెల్లని పలువరస బయట పెట్టింది. గబ గబ ఆ యింటిని దాటాను. ఓ గుడిసెలో నుండి యెవరిదో యేడుపు. ఎవరో పోయారు కాబోలు. అదే సంపాదించేవాడై తేనో, పాపం ఆ కుటుంబం ఏమవుతుందో! మరో వైపు ఒక మగాడు, ఆడది యెందుకో ఘర్షణ పడుతూ బిగ్గరగా అరుచుకొంటున్నారు. ఉన్నట్లుండి వీధి కుక్కలు గయ్‌మని అరవ సాగాయి.

మరో నాలుగడుగులు వేశాను. కూని రాగం తీస్తూ యెబ్బెట్టుగా వయ్యారా లొలకబోస్తూ పళ్ళికిలిస్తూ నిలుచుకున్న మరో తెల్లచీర వెకిలిగా చూసి చేత్తో సైగ చేసింది. కంకర రోడ్డు పైన నడుస్తున్న నా కాళ్ళకింద యేదో మెత్తగా తగిలింది. పక్కకు జరిగి చూశాను. బాగా నమిలి వుమ్మేసిన చెరకు పిప్పి, ఛ! ఛ! రాగూడని ప్రాంతానికి వచ్చానేమో అనిపించింది. అయినా నారాయుడిని చూడాలి. మరో పదడుగులు వేశానో లేదో యీలవేస్తూన్న చప్పుడు నా వెనుకనే వినవచ్చింది. వెనుదిరిగి చూశాను. [illegible], పూల లుంగీ చుట్టుకొన్న ఒక ఆసామీ నన్ను సమీపించాడు. "పొణ్ణు వేణుమా సార్, కాలేజి గరల్ సార్! ఆయిక్లాస్, సొల్లుంగో సార్'' అన్నాడు. వ్యభిచారు లుండే వీధికి వచ్చానన్నది నా కర్థమైంది. నేను వాడికెలాంటి సమాధానమూ యివ్వకుండా గబ గబ అడుగులేస్తూ ముందు కెళ్ళాను.

ఆ ప్రాంతం మరీ చీకటి గుయ్యారంలా వుంది. 'ఏవో ఆకారాలు తిరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి చుట్టూ గుడిసెలు. బురదా, చెత్తా చెదారాలతో నిండిన ఆ రోడ్డూ అంతకు మించి ఆ చీకట్లోనే అటూ యిటూ తచ్చాడుతూన్న బురద బ్రతుకులు చూస్తుంటే మరి కాళ్ళు ముందుకు సాగలేదు.

ఇక లాభం లేదని వెనుదిరిగి గబగబ నడుస్తున్నాను. చెదరిన చిల్లపెంకులను దాటి, కొళాయిని దాటి ముందుకు వెళ్తున్నాను. మళ్ళీ యీల వెన్నంటే వస్తూంది. మరింత దగ్గిరగా, బిగ్గరగా వినవస్తూంది. మెయిన్ రోడ్డు చేరుకొన్నాను. అక్కడ మెర్క్యూరీ కాంతులు తెల్లగా రోడ్డంతా పరుచుకున్నాయి.

''సార్! మంచి అమ్మాయి సార్! ఏ క్లాస్ గర్ల్ కావాలా సార్!'' స్వచ్ఛంగా పలుకుతున్న ఆ ఉచ్చారణ విని తృళ్ళిపడ్డాను. ఒక్కసారి వెనుదిరిగి చూశాను, అంతే! నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. వాడే....నా సాయికి మారు రూపంగా వూహించుకున్న నారాయణ....విద్యావంతుడై ఒక మనిషిగా పైకెక్కి రాగలడని నేను యెన్నో ఆశలు పెట్టుకున్న నారాయణ....నా శక్తి సామర్థ్యాల మేరకు పైకి తీసుకు రాగలనని యెన్నో కలలుకన్న నారాయణ....నన్ను చూడగానే హడలిపోయాడు, తెల్లటి మెర్క్యూరీ దీపకాంతుల నుండి పరుగెత్తి ఆ చిమ్మచీకటులలో అంతర్థానమై పోయాడు.